


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 55 | శనివారం 25 జూలై, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## వాంగ్‌చుక్ దీక్ష సక్సెస్..
## కేంద్రానికి ఇదొక మేల్కొలుపు

జులై 24 వార్త సాక్ష్యం

పరీక్షా పత్రాల లీకేజీల పై జవాబుదారీతనం, విద్యా సంస్కరణలు కోరుతూ ప్రముఖ పర్యావరణవేత్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్ష విజయవంతమైందని ఆయన అర్ధాంగి గీతాంజలి జె ఆంగ్మో ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పలు అంశాల పై లిఖితపూర్వక హామీలు లభించిన తర్వాతే ఈ దీక్ష విరమించినట్లు ఆమె స్పష్టం చేశారు. - మిగతా2లో



## ఇరాన్ పై విరుచుకుపడుతున్న అమెరికా..
## వరుసగా 13వ రోజు వైమానిక దాడులు

జులై 24 వార్త సాక్ష్యం

ఇరాన్ సైనిక స్థావరాల పై అమెరికా బలగాలు తమ దాడిని మరింత ఉధృతం చేశాయి. అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం, యూఎస్ దళాలు వరుసగా 13వ రోజు రాత్రి కూడా ఇరాన్‌లోని పలు వ్యూహాత్మక లక్ష్యాల పై వైమానిక దాడులు నిర్వహించాయి. అమెరికా కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 6:45 గంటలకు ఈ దాడుల పర్వం ప్రారంభమైంది. - మిగతా2లో



## ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండకూడదు: సీఎం చంద్రబాబు



- తల్లి, చెల్లిని గౌరవించని వారు రాజకీయాలకు అనర్హులన్న సీఎం
- డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యను ప్రస్తావిస్తూ గత పాలనపై విమర్శలు
- పిల్లలకు చదువును మించిన గొప్ప ఆస్తి మరొకటి లేదని స్పష్టీకరణ
- ప్రభుత్వ బడులపై నమ్మకంతో లక్షా పది వేల మంది చేరారని వెల్లడి

## తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
## నెరవేరనున్న ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియకు వేగంగా అడుగులు
- ఆగస్టు మూడో వారంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే అవకాశం
- డిసెంబరు 9న విలీనంపై తుది ప్రకటన చేసేందుకు ప్రభుత్వ కసరత్తు
- విలీన విధివిధానాల్లో ఎన్నికల్లో గెలిచిన సంఘానికి భాగస్వామ్యం
- ఏప్రిల్ సమ్మె హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ చర్యలు




## నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు

జులై 24 వార్త సాక్ష్యం

ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు. - మిగతా2లో



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం

- నీట్ లీక్ వివాదంలో ప్రధాన్ రాజీనామాకు పట్టుబడుతున్న సీజేపీ
- ప్రధాన్ రాజీనామాపై శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరిన కేంద్రం
- మంత్రి రాజీనామా చేస్తేనే ఆందోళన విరమిస్తామని విద్యార్థుల స్పష్టీకరణ



## గిరిజన పాఠశాలలకు పక్కా భవనాలు..
## ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం



జులై 24 వార్త సాక్ష్యం

వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో సొంత భవనాలు లేని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మిస్తామని, శిథిలావస్థలో ఉన్నవాటిని ఆధునికీకరిస్తామని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో పెరిగిన విశ్వాసంతో ఈ ఏడాది 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఇది రెండేళ్ల తమ ప్రభుత్వ కృషికి నిదర్శనమని ఆయన అన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 25 జూలై, 2026

## వాంగ్‌చుక్ దీక్ష సక్సెస్.. కేంద్రానికి ఇదొక మేల్కొలుపు

కేంద్ర ప్రభుత్వం నుంచి పలు అంశాలపై లిఖితపూర్వక హామీలు లభించిన తర్వాతే ఈ దీక్ష విరమించినట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ ఉద్యమానికి దేశవ్యాప్తంగా లభించిన మద్దతు, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఒక మేల్కొలుపు కావాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. విలేకరులతో మాట్లాడిన గీతాంజలి, ప్రభుత్వం ఇచ్చిన హామీల వివరాలను వెల్లడించారు. "ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక హామీతో సోనమ్ వాంగ్‌చుక్ వారి భద్రతను నిర్ధారించారు. జులై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొన్న వారిపై గానీ, జంతర్ మంతర్ వద్ద ఇంకా నిరసన తెలుపుతున్న వారిపై గానీ ఎలాంటి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయబోమని, లాఠీఛార్జ్ వంటి బలప్రయోగం ఉండదని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది" అని ఆమె వివరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు కేవలం విద్యార్థులకే పరిమితం కాలేదని గీతాంజలి తెలిపారు. "నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందిస్తామని ప్రభుత్వం అంగీకరించింది. అన్నింటికన్నా ముఖ్యంగా మేము ముందుకు తెచ్చిన పరీక్షలు, విద్యా సంస్కరణల ప్రతిపాదనలపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చిస్తామని, కచ్చితంగా ఒక పరిష్కారం కనుగొంటామని రాతపూర్వకంగా సంతకం చేసి మాకు ఇచ్చారు" అని ఆమె వెల్లడించారు. ఈ హామీలతో తాము తొలి విజయం సాధించామన్నారు. ఈ ఉద్యమం కేవలం పరీక్షల గురించి మాత్రమే కాదని, దేశవ్యాప్త సమస్యలకు ప్రతీకగా నిలిచిందని గీతాంజలి అభిప్రాయపడ్డారు. "ఈ ఉద్యమం విజయవంతం కావడం వెనుక మరో ముఖ్య కారణం దేశం మేల్కొనడం. నీట్ పేపర్ లీక్ అనేది కేవలం ఒక లక్షణం మాత్రమే, దాని వెనుక ఉన్న అసలు కారణాలు విద్యతో పాటు న్యాయవ్యవస్థతో సహా అన్ని వ్యవస్థలలోనూ ఉన్నాయి. దేశవ్యాప్తంగా మాకు మద్దతు లభించింది. ఇది సామాన్యుడి దైనందిన కష్టాలకు ప్రతిబింబం. ప్రభుత్వానికి ఇదొక మేల్కొలుపు అవుతుందని, దేశ ప్రజలు వారిపై నిరాశతో ఉన్నారనే విషయాన్ని వారు గ్రహించి ఉండవచ్చని మేము ఆశిస్తున్నాము" అని ఆమె అన్నారు. అధికార, ప్రతిపక్షాలకు చెందిన నాయకులందరూ ఈ అంశాలను పార్లమెంటులో చర్చిస్తామని హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. ఇది కేవలం తొలి అడుగు మాత్రమేనని, విద్యా సంస్కరణల కోసం పోరాటం కొనసాగుతుందని గీతాంజలి స్పష్టం చేశారు. ఇక సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం గురించి మాట్లాడుతూ.. "ప్రస్తుతం ఆయన ద్రవాహారం తీసుకుంటున్నారు. జీర్ణవ్యవస్థను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి కొంత సమయం పడుతుంది. త్వరలోనే సెమీ-సాలిడ్స్, ఆ తర్వాత ఘనపదార్థాలు తీసుకోవడం ప్రారంభిస్తారు" అని ఆమె తెలిపారు.

## ఇరాన్ పై విరుచుకుపడుతున్న అమెరికా.. వరుసగా 13వ రోజు వైమానిక దాడులు

అమెరికా కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం 6:45 గంటలకు ఈ దాడుల పర్వం ప్రారంభమైంది. 'ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్' నుంచి అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు పొంచి ఉన్న ముప్పును నివారించడం, ఇరాన్‌ను జవాబుదారీగా చేయడమే ఈ దాడుల ముఖ్య ఉద్దేశమని CENTCOM స్పష్టం చేసింది. గత తొమ్మిది రోజులుగా పునః ప్రారంభించిన నౌకాదళ దిగ్బంధం ద్వారా ఇరాన్ రేవుల్లోకి ప్రవేశించకుండా లేదా బయటకు వెళ్లకుండా ఇప్పటివరకు 12 వాణిజ్య నౌకలను దారి మళ్లించగా, ఒక నౌకను పూర్తిగా నిరోధించినట్లు అమెరికా అధికారులు తెలిపారు.

**నష్టపరిహారం ఇరాన్ సొమ్ము నుంచే: డొనాల్డ్ ట్రంప్**

ఈ దాడుల నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతా ద్వారా ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'ఇప్పటి నుంచి నౌకలకు, సరకు రవాణాకు లేదా వాటికి సంబంధించిన దేనికైనా నష్టం వాటిల్లితే... ఆ నష్టపరిహారాన్ని అమెరికా ఆధీనంలో ఉన్న ఇరాన్ సొమ్ము నుంచే వసూలు చేయడం జరుగుతుంది. ఇది అత్యంత న్యాయమైన, నిష్పాక్షికమైన చర్య'అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

**'అణు ఆయుధాలను అస్సలు సహించం'**

ఇరాన్ ఎలాంటి పరిస్థితుల్లోనూ అణు ఆయుధాన్ని పొందేందుకు వీల్లేదని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరాన్ అణు ఆయుధాల గురించి ఆలోచించడానికి కూడా వీల్లేదని, ప్రతీకార చర్యలకు వారు సిద్ధంగా లేరని ట్రంప్ చెప్పారు. ఈ చర్యను గతంలోనే ఇతర అమెరికా అధ్యక్షులు లేదా ఇతర దేశాలు చేసి ఉండాల్సిందని, వేరే ఎవరూ చేయలేకపోయిన పనిని తాము చేసి చూపిస్తున్నామని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనలు ఉద్ధృతం చేసినప్పటికీ, ఆయన రాజీనామాకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని తెలుస్తోంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. "రాజీనామా చేయడం చాలా తేలికైన నిర్ణయం. కానీ ప్రజలు మాకు అధికారం ఇచ్చింది బాధ్యతలను నిర్వర్తించడానికే తప్ప, పారిపోవడానికి కాదు. మేము వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో నెలకొన్న వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడంపైనే ప్రస్తుతం ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న సీజేపీ విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రతినిధులుగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, శాంతియుత నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం, మంత్రి రాజీనామా విషయంలో మాత్రం శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరినట్లు కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, అభిజీత్ దీప్కే తేల్చి చెప్పారు.

## తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. నెరవేరనున్న ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న చిరకాల వాంఛను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ప్రణాళిక ప్రకారం అన్నీ జరిగితే, తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన డిసెంబరు 9వ తేదీన విలీనంపై తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈలోగా విలీన ప్రక్రియకు సంబంధించిన పూర్తి విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. విలీన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది. ఆగస్టు మూడో వారంలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సంఘాన్ని విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ హామీతో కార్మిక సంఘాలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, డిపోల వారీగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు వంటి 32 డిమాండ్లను యాజమాన్యం ముందుంచారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు చాలా డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చింది. ఇప్పుడు అత్యంత కీలకమైన విలీనం, ఎన్నికల ప్రక్రియలపై దృష్టి సారించింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం, మొదట ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, గెలిచిన సంఘం అభిప్రాయాలను తీసుకుంటారు. ఆ తర్వాత విలీనానికి సంబంధించిన ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన అంశాలపై తుది విధివిధానాలను ఖరారు చేస్తారు. డిసెంబరు 9న విలీనంపై అధికారిక ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం నుంచి ఇప్పటికే సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ ఉద్యోగుల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు స్పష్టమవుతోంది.

## ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండకూడదు: సీఎం చంద్రబాబు

తల్లిని, సొంత చెల్లిని గౌరవించని వారు సమాజానికి ఏం మేలు చేస్తారని, అలాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటానికి అనర్హులని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కనీస విలువలు లేని వారు రాజకీయాల్లో కొనసాగడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని ఆయన అన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న చంద్రబాబు, గత ప్రభుత్వ హయాంలో అరాచకాలు జరిగాయంటూ ధ్వజమెత్తారు. ఈ నియోజకవర్గంలోనే ఒక దళిత డ్రైవర్‌ను దారుణంగా హత్య చేసి, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన నేతలు రాజకీయం చేశారని, అలాంటి దుర్మార్గాలను ప్రజలు మరిచిపోకూడదని పిలుపునిచ్చారు. మంచిని ప్రోత్సహించి, చెడును నిలదీసినప్పుడే సమాజంలో మార్పు వస్తుందని ఆయన స్పష్టం చేశారు. తాము రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి కూటమిగా పనిచేస్తుంటే, కొందరు మాత్రం కేవలం బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మెగా డీఎస్సీ ద్వారా వేలాది మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పిస్తే, దానిపైనా విమర్శలు చేస్తూ నియామకమైన టీచర్ల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని, అధికారులు గానీ, నేతలు గానీ ఎవరైనా తప్పు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థ ప్రాధాన్యతను వివరిస్తూ.. పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వగలిగే శాశ్వతమైన, గొప్ప ఆస్తి చదువేనని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే విద్యాశాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వ బడులపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, అందుకే ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల నుంచి లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని అన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశాలకు తల్లులతో పాటు తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరై తమ పిల్లల ప్రగతిని సమీక్షించుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టళ్లు, గురుకులాల్లో డైట్ ఛార్జీలను 10 శాతం పెంచామని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ కోచింగ్ అందిస్తున్నామని తెలిపారు.

## గిరిజన పాఠశాలలకు పక్కా భవనాలు.. ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం

పోలవరం జిల్లా రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణల ఫలాలను వివరించారు. "మనందరి రెండేళ్ల కృషి ఫలించింది. చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల ముందు 'నో అడ్మిషన్' బోర్డులు చూస్తున్నాం. ఇది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమష్టి విజయం. వారే ప్రభుత్వ పాఠశాలలకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు" అని లోకేశ్ అన్నారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలో ఒక తల్లి తన బిడ్డకు ప్రభుత్వ పాఠశాలలో సీటు ఇప్పించాలని అడగడం తనను ఆశ్చర్యపరిచిందని, ప్రభుత్వ బడుల్లో సీట్లకు డిమాండ్ పెరగడం ఉపాధ్యాయుల కఠోరశ్రమకు నిదర్శనమని కొనియాడారు.

**విద్యా వ్యవస్థలో సంస్కరణల వెల్లువ**

విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొస్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చానని, ఆ మాట నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగానే 'తల్లికి వందనం' పథకాన్ని గత ప్రభుత్వానికి భిన్నంగా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ వర్తింపజేస్తున్నామని స్పష్టం చేశారు. 2025లో 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ. 10,090 కోట్లు, 2026లో 67.47 లక్షల మందికి రూ. 10,120 కోట్లు అందించామని గణాంకాలతో సహా వివరించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, పారదర్శకమైన టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్ట్ తీసుకొచ్చామని తెలిపారు. డొక్కా సీతమ్మ పేరుతో ప్రాంతీయ రుచులకు అనుగుణంగా మెనూతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ కిచెన్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యార్థులకు కిట్స్ అందిస్తున్నామని, విద్యార్థుల సమగ్ర వికాసం కోసం శనివారాల్లో 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నామని వివరించారు. ఇంటర్ విద్యార్థులకు కూడా స్టూడెంట్ కిట్స్, మధ్యాహ్న భోజనాన్ని విస్తరించినట్లు తెలిపారు.

# నీట్ కుట్రల వెనుక విదేశీ శక్తులు

నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు. నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, ఇప్పటికే సీబీఐ విచారణ వేగవంతం చేసి 11 మంది ఫ్యాకల్టీ సహా మొత్తం 17 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకూడదనే ఉద్దేశంతో కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను కూడా వెల్లడించామని వివరించారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు తీవ్ర అరాచకం సృష్టించాయని ఆయన ఆరోపించారు. ఏకంగా దేశ పార్లమెంట్ పై దాడి చేసేందుకు కుట్రలు చేస్తూ, దేశ వ్యతిరేక నినాదాలతో విరుచుకుపడ్డారని మండిపడ్డారు. నిరసనల పేరుతో పోలీసులపై, మహిళా జర్నలిస్టులపై అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులు చేశారని విమర్శించారు. ఈ హింసలో 118 మంది పోలీసుల తలలు పగిలి తీవ్ర గాయాలైనా, అత్యంత సంయమనం పాటిస్తూ ఫైరింగ్ చేయలేదని, శాంతిభద్రతల రక్షణ కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఢిల్లీలో చెలరేగిన ఈ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర కోణం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా సోషల్ మీడియాలో నిమిషాల వ్యవధిలో విష ప్రచారం చేస్తూ, దేశంలో అశాంతిని రేపేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు.

## కోర్టు దృశ్యాలను ప్రసారం చేయడం పై సుప్రీంకోర్టు ఆగ్రహం

కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సోషల్ మీడియాలో విచ్చలవిడిగా, అసంపూర్తిగా ప్రసారం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. కోర్టు కార్యకలాపాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని సీసాలో నుంచి బయటకు వచ్చిన భూతంతో పోల్చిన ధర్మాసనం, సంబంధిత కోర్టుల ముందస్తు అనుమతి లేకుండా వాటిని పోస్ట్ చేయడం, ఎడిట్ చేయడం లేదా రీ-పోస్ట్ చేయడంపై మధ్యంతర స్టే విధిస్తూ సంచలన ఆదేశాలు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపింది. సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ లేదా ఆయా హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్ ముందస్తు అనుమతి లేకుండా విచారణల వీడియోలను ఎక్స్‌ట్రాక్ట్ చేయడం, మార్పులు చేయడం, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం లేదా వాటి ద్వారా ఆదాయం పొందడం పూర్తిగా నిషిద్ధమని స్పష్టం చేసింది. అయితే ఈ ఉత్తర్వులు సాధారణ వార్తా కవరేజ్ లేదా జర్నలిజం రిపోర్టింగ్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపవని, ఇవి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అడ్డుకునే ఉత్తర్వులు కాదని ధర్మాసనం తెలిపింది. విచారణ క్లిప్‌లు వైరల్ కావడంపై వివరణ ఇవ్వాలని మెటా, ఎక్స్ సహా పలు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి మాట్లాడుతూ... కోర్టులు 24 గంటల ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెళ్లు కావు అని స్పష్టం చేశారు.

## విద్యార్థుల పై పెల్లెట్ గన్స్ వాడారు..

నీట్ ప్రశ్నపత్రాల లీక్ పై ఆందోళన చేసిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై భద్రతా బలగాలు పెల్లెట్ గన్స్ ఉపయోగించాయని, దీంతో కొందరు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. 19 ఏళ్ల విద్యార్థి ఒకరి కంటికి తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. గాయపడిన విద్యార్థులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ తెలిపిన వివరాల ప్రకారం.. సాహిల్ అనే 19 ఏళ్ల విద్యార్థి జాతీయ జెండా పట్టుకుని శాంతియుతంగా నిరసనలో పాల్గొన్నాడు. అతనికి పెల్లెట్ తగిలి ఒక కన్ను తీవ్రంగా దెబ్బతింది. ప్రస్తుతం అతనికి చూపు తిరిగి వస్తుందా లేదా అన్న విషయంపై వైద్యులు కూడా స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉందని రాహుల్ తెలిపారు. విద్యార్థులు న్యాయం కోరితే వారిపై ఇలాంటి దమనకాండకు పాల్పడటం తీవ్ర ఆందోళనకరమని విమర్శించారు. జులై 20న జరిగిన సీజేపీ 'సంసద్ చలో' నిరసన సందర్భంగా పలువురు విద్యార్థులకు పెల్లెట్ గాయాలు అయ్యాయని కొన్ని మీడియా కథనాలు పేర్కొన్నాయి. గాయపడిన వారి వాంగ్మూలాలు, వైద్య రికార్డులను ఉటంకిస్తూ ఈ ఆరోపణలు వెలువడ్డాయి. అయితే విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు, అధికారిక ఫ్యాక్ట్‌చెక్ విభాగం ఇప్పటికే ఖండించాయి.

వార్త సాక్ష్యం
శనివారం 25 జూలై, 2026

# క్రీడాకారులు అమరావతి ఛాంపియన్షిప్ ని సద్వినియోగం చేసుకోండి

-జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం. ఎన్. వి. రాజు



ఆత్మకూరు జులై 24 వార్త సాక్ష్యం

ఈనెల 25 వ తేదీ ఆత్మకూరు కెవికె స్టేడియం లో నిర్వహించే క్రీడా సెలెక్షన్ నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా క్రీడబివృద్ధి అధికారి ఎం ఎన్ వి .రాజు గతెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్పోర్ట్స్ క్లబ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలోఈ సందర్భంగ మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన 17 సంవత్సరాల నుంచి 23 సంవత్సరాలు వరకు వయసు గల క్రీడాకారులు 12 రకాల క్రీడల్లో సెలెక్షన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా,సతీష్, మహేబూబ్, నంద్యాల జిల్లా క్రీడా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# కొట్టాల చెరువు గ్రామంలో ఘనంగా మెగా పిటీఎం వేడుకలు

-ముఖ్య అతిథులుగా హాజరైన ఆత్మకూరు ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి




ఆత్మకూరు జులై 24 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల కొట్టాల చెరువులో మెగా పీటీఏశీ 4.0 వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆత్మకూరు సబ్ ఇన్స్పెక్టర్. వెంకట నారాయణరెడ్డి,టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రవీంద్ర బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ బాలల విద్య, డ్రగ్స్,ఆన్లైన్ మోసాలు , మొదలగు వాటిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు..తల్లిదండ్రులచే “డ్రగ్స్ వద్దు బ్రో” అనే ప్రతిజ్ఞ చేయించారు..అలాగే ఉపాధ్యాయులు “తల్లికి వశీదనం,దీక్ష,లీప్” యాప్ లపై అవగాహన కల్పించారు..వారి మొబైల్స్ లలో యాప్ లను ఇంస్టాల్ చేశారు..నేటి యువతరం డ్రగ్స్ కోసం పోవద్దని, ఈజీ మనికి అలవాటు పడి ఆన్లైన్ మోసాలకు గురి కావద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు ,ఉపాధ్యాయులు నరేష్,శ్రీనివాసులు, కరీం భాష ,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురం పాఠశాల ప్రతిభావంతులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాల అందజేత

ఆత్మకూరు జూలై 24, వార్త సాక్ష్యం



మండల పరిధిలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కొట్టాల చెరువు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. వెంకటేశ్వర్లుఅభినందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చదివి, పబ్లిక్ పరీక్షల్లో 500 కంటే ఎక్కువ మార్కులు సాధించిన ప్రతిభావంతులైన 13 మంది విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేశారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన మెగా పీటీమ్ 4.పి కార్యక్రమంలో జిల్లా పరిషత్ వెంకటాపురం ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి చేతుల మీదుగా అర్హులైన ప్రతి విద్యార్థికి 1,000 నగదు బహుమతితో పాటు, ప్రశంసా పత్రాన్ని బహూకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల తో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు ఈ సదుపాయాలను వాడుకుని తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. 500 పైగా మార్కులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులను, వారికి మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. నగదు పురస్కారాలు అందించిన వై . వెంకటేశ్వర్లు పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీయుపీ ఉర్దూ పాఠశాలలో ఘనంగా “మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్ విజయవంతం





-ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల కో ఆప్షన్ మెంబర్ సయ్యద్. ముర్తుజాఅలి

పాములపాడు జూలై 24 వార్త సాక్ష్యం:-

పాములపాడు మండల కేంద్రంలోని, (ఎంపీయుపి) మండల ప్రజా పరిషత్ అప్పర్ ప్రైమరీ ఉర్దూ పాఠశాల హెచ్ఎం- బద్రున్నిసా బేగం ఆధ్వర్యంలో పిల్లల బంగారు భవిష్యత్ కోసం- బడి వైపు ఒక అడుగు అనే నినాదంతో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శుక్రవారం (మెగా పీటీమ్ 4.0) విజయవంతంగా కొనసాగింది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల కో ఆప్షన్ మెంబర్ సయ్యద్.ముర్తుజాఅలీ హాజరయ్యారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కో ఆప్షన్ మెంబర్ సయ్యద్. ముర్తుజాఅలీ, పాఠశాల హెచ్ఎం- బద్రునిసా బేగం, విద్యా కమిటీ చైర్మన్ సుభాన్ మౌలానా, ఉపాధ్యాయులు నిజాముద్దీన్, జరీనా, తదితరులు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు ఉపాధ్యా యుల పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయం తో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండల కో ఆప్షన్ మెంబర్ పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కూర్చొని ఎంతో ఆత్మీయంగా మధ్యాహ్న భోజనం చేశారు. ప్రభుత్వ అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించి, వంట ఏ విధంగా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన విద్యార్థులతో కలిసి స్వయంగా భోజనం చేయడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ మొగిలిశ్వరమ్మ, ఎంపియుపి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు తదితరులు,పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి







-ఆత్మకూరు సిపిఐ పార్టీ నేతల డిమాండ్

ఆత్మకూరు జులై 24 వార్త సాక్ష్యం

దేశ రాజధాని ఢిల్లీ నగరం లో నిట్ పేపర్ వరుస లికేజ్ లకు కారణమైన విద్యా శాఖ మంత్రి ని తక్షణమే రాజీనామా చేయాలని,విద్యార్థుల పై విచక్షణ రహితంగా దాడులు చేయడం మోడీ ప్రభుత్వం నకు తగదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు లు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఢిల్లీ అక్రమ అరెస్ట్ లను నిరసిస్తూ గౌడ్ సెంటర్ లో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భం గా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నెల రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్య శక్తులు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. దేశ అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ ఇంజనీర్, పర్యావరణవేత్త సోను వాంగ్చుక్ ఇరవై రోజులుగా ప్రాణాలను పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా స్పందించలేదాన్నరు. .విద్యార్థుల “చలో పార్లమెంట్” కార్యక్రమంలో లక్షలాది మంది యువత శాంతియుతంగా పాల్గొంటే, వారిని చర్చలకు ఆహ్వానించాల్సిన ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి లాఠీలతో విచక్షణారహితంగా కొట్టించడం, విద్యార్థినులని కూడా చూడకుండా ఈడ్చిపారేయడం, బట్టలు చించడం, గొంతు నొక్కడం, నేలకేసి పడేయడం, పిడిగుద్దులతో, బూట్లతో, బలవంతంగా దాడులు చేయించడం ప్రజాస్వామ్య భారతదేశంలో అత్యంత సిగ్గుచేటు ఘటన అని తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో లాఠీచార్జీలో పాల్గొన్నది పోలీసులు అనే పేరుతో ఉన్న చట్ట పరిరక్షకులా? లేక అధికార పార్టీకి సేవ చేసే రౌడీ మూకలా? ఆర్ఎస్ఎస్ కార్యకర్తలా? అనే ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యను హక్కుగా కాకుండా కార్పొరేట్ వ్యాపారంగా మార్చిన విధానాలే నేటి నీట్ కుంభకోణాలకు మూల కారణమని ఆయన విమర్శించారు.. పేపర్ లీకేజీ పై అటు పార్లమెం టులో ఇటు రాజ్యసభలో చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టిన ప్రభుత్వం దాటవేత వైఖరి అవలంబిస్తూ, ఎదురుదాడికి దిగుతుందన్నారు. ప్రధాన్, ఢిల్లీ పోలీసుల దుశ్చర్యకు బాధ్యత వహిస్తూ హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, భారత ప్రధాని నరేంద్ర మోడీ భారతీయులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థి పోరాటం పట్ల ప్రభుత్వ వైఖరి మారకపోతే మోడీ రాజకీయ సమాధికి పునాది రాయిగా మారి విద్యార్థి ఉద్యమం నిరంకుశ అహంకర మోడీ ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకలించి వేస్తుందన్నారు. విద్యార్థి ఉద్యమానికి బాసటగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు పాల్పడతారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఐ ఆత్మకూరు కార్యదర్శి టి ప్రతాప్, ఏఐవైఎఫ్ నాయకులు రాజశేఖర్,కొత్తపల్లి, పాములపాడు మండల కార్యదర్శిలు వెంకటసవుడు, యేసేపు పట్టణ సిపిఐ నాయకులు బిసన్న, దూద్ పీరా తదితరులు పాల్గొన్నారు

# నందికొట్కూరు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్ విజయవంతం

నందికొట్కూరు జులై 24 వార్త సాక్ష్యం




నీట్ పరీక్షల పేపర్ లీకేజ్ వ్యవహారంపై కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వైఫల్యాన్ని నిరసిస్తూ, దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని విద్యాస ంస్థలు విజయవంతంగా బంద్ నిర్వహించ బడ్డాయి. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పీడీఎస్ యు, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎఫ్ డిఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆది, సూరి,హరి,అశోక్ లు మాట్లాడుతూ, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థను ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజ్ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఘోర ఘటన అని, దీనికి పూర్తి రాజకీయ, పరిపాలనా బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని విమర్శించారు. విద్యార్థులు న్యాయం కోరుతూ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే, వారిపై లాఠీచార్జీలు, బాష్పవాయు ప్రయోగాలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు. విద్యార్థుల గొంతును అణచివేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం తన వైఫల్యాలను దాచుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థి సంఘాల బంద్‌కు మద్దతుగా సీపీఐ, నాయకులు వీ. రఘురామ మూర్తి, శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, దేశ అత్యున్నత న్యాయస్థానం భారత ప్రధాన న్యాయమూర్తి విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అత్యంత కీలకమైన అంశాన్ని అత్యవసరంగా పరిగణనలోకి తీసుకుని, పారదర్శకమైన విచారణ జరిగేలా, విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగేలా తగిన ఆదేశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శ్యామ్ నాయక్, అంజి,శివాజీ ఆది, యశ్వంత్, చందు, నాని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

# మాతృశక్తి జాగరణతోనే దేశం సర్వతోముఖాభివృద్ధి





**-ఘనంగా ముగిసిన తి.తి.దే. ధార్మిక కార్యక్రమాలు**

**-డాక్టర్ మల్లు వెంకటరెడ్డి**

నందికొట్కూరు జులై 24 వార్త సాక్ష్యం

మాతృశక్తి జాగరణతోనే దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని, మాతృశక్తి అనేది కేవలం కుటుంబానికే కాదు, సమాజానికీ, దేశానికీ మూలాధారమని, మాతృశక్తి మేల్కొంటే కుటుంబం వికసిస్తుందని, కుటుంబం వికసిస్తే సమాజం బలపడుతుందని, సమాజం బలపడితే దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుండి జూపాడు బంగ్లా మండల కేంద్రం లోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం గోపూజ కుంకు మార్చన కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.



మూడురోజులు జి. వెంకట రమణయ్య చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు ఇల్లూరి లక్ష్మీనారాయణ శ్రేష్ఠి, అర్చకులు సత్యమయ్య, శివయోగి సిద్దరా మేశ్వర నాగలింగేశ్వర బ్రహ్మవిద్యా ఆశ్రమం నిర్వాహకులు గోవిందుస్వామి, ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, అన్నదాన సత్రం నిర్వాహకులు రామయ్య, స్కాలర్స్ ఇ. మీ. పాఠశాల ప్రిన్సిపాల్ కాళ్ళూరి లక్ష్మి, అర్చకులు ఉమ్మయ్య, భజన మండలి సభ్యులు చిన్నతిరుపాలు, జి.రంగ స్వామి, బాబు, రాము, కృష్ణమూర్తి, నాగశేషులు, నారాయణరెడ్డి, వెంకటరమణ, శ్రీవీరభద్రస్వామి దేవస్థానం పూజారి పాండురం గస్వామి, మల్లిఖార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కరివేన గ్రామం ఆత్మ ఆధ్వర్యంలోరైతులకు శిక్షణ కార్యక్రమం పై అవగాహన





**-మండల వ్యవసాయ శాఖ అధికారిని కే. హేమలత**

ఆత్మకూరు జులై 24 వార్త సాక్ష్యం

ఆత్మకూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని రైతులు సాగు చేస్తున్న పంటలను వాతావరణానికి అనుగుణంగా సాగు చేసుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ మేడం సీనియర్ శాస్త్రవేత్త బాలాజీ నాయక్ మండల వ్యవసాయ శాఖ అధికారిని, కే. హేమలత ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని కరివేన గ్రామంలో ఆత్మ శాఖతో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాల మీద రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రస్తుతం సాగు చేసిన పంటలు వర్షభావ పరిస్థితిలో ఉన్నందున, పంటలను కాపాడుకోవడానికి యూరియా ఒక లీటర్ నీటికి 20 గ్రాములు చొప్పున లేదా పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలపడం జరిగింది అదేవిధంగా ఇప్పటికీ ఇంకా పంటల సాగు చేయని రైతులు వాతావరణ శాఖ మరియు వ్యవసాయ శాఖ ద్వారా ఇచ్చినటువంటి ముందస్తు సమాచారాన్ని బట్టి పంటలు సాగు చేసుకోవాలని తెలపడం జరిగింది. ఆగస్టులో కురిసే వర్షాలకి కొర్ర, కంది లాంటి పంటలు సాగు చేసుకోవాలని, సెప్టెంబర్ మాసంలో కురిసే వర్షాలకి జొన్న, ఉలవలు లాంటి పంటలు వేసుకోవాలని, అక్టోబర్ మాసంలో కురిసే వర్షాలకు మినుము, ప్రొద్దుతి రుగుడు, శనగ లాంటి పంటలు వేసుకోవాలని అలాగే నవంబర్లో అయితే కుసుమ వంటి పంటలు సాగు చేసుకోవాలని తెలపడం జరిగింది.ప్రస్తుతం చెరువు కింద ఉన్నటువంటి గ్రామాల్లో వరి పంట సాగు చేయరాదని, వాతావరణ శాఖ ఇచ్చిన సమాచారం మేరకు వర్షాలు తక్కువగా ఉన్నాయని కాబట్టి వరి పంట బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన మినుము, పెసర, జొన్న, కొర్ర, సజ్జ వంటి తక్కువ కాలపరిమితి మరియు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు వేసుకోవాలని సూచించడం జరిగింది. అదేవిధంగా పంటలు సాగు చేసి ఉన్న రైతులు తప్పనిసరిగా పంటల భీమా నమోదు చేయించుకోవాలని దానికి ఈనెల 31 వ తారీకు చివరి తేదీ అని తెలపడం జరిగింది. అలాగే పంటల సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలని చెప్పి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నాగ ఉమా మహేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు అశోక్ కుమార్, గ్రామ రెవిన్యూ అధికారి శాలి సాహెబ్ మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మికి ఆషాఢ సారె



బాపట్ల జులై 24 వార్త సాక్ష్యం

బాపట్ల పట్టణంలోని నరాలశెట్టివారిపాలెంలో వెలసిన శ్రీ అష్టలక్ష్మి అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పించారు.మేళతాళాలు, సంప్రదాయ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకున్న మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నరాలశెట్టి ప్రకాశ్‌రావు, నరాలశెట్టి పార్థసారథి, బీవీఎస్ రాస్ శాస్త్రి, సుధాకర్‌రావు, పానకాల వెంకటరాయుడు, కొలగాని వెంకటేశ్వర్లు, అర్చక స్వామి పవన్ కళ్యాణ్ శర్మ, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది.

# పేదల సంక్షేమమే కలాం ఫౌండేషన్ ధ్యేయం



కర్లపాలెం జులై 24 వార్త సాక్ష్యం

కర్లపాలెం మండలంలోని పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ అబ్దుల్ కలాం ఫౌండేషన్ ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా కర్లపాలెం పాతూరులో నివసిస్తున్న ఓ నిరుపేద కుటుంబానికి ఫౌండేషన్ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ బాషా 10 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాతలు, సభ్యుల సహకారంతో ప్రతి శుక్రవారం పేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. మండలంలో అవసరమైన కుటుంబాలను గుర్తించి వారికి తమ వంతు చేయూత అందించడం ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరింత మంది పేదలకు అండగా నిలిచి సేవలను విస్తరించాలని మండల ప్రజలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ షేక్ సుభాని, మాజీ కో-ఆప్షన్ సభ్యులు షేక్ బాషా, షేక్ బహదూర్ బాషా, షేక్ బాజీ (ఆర్మీ రిటైర్డ్) తదితరులు పాల్గొన్నారు.

# మెగా పేరెంట్స్--టీచర్స్ మీట్‌తో విద్యాభివృద్ధికి నూతన దిశ



ముండ్లమూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్--టీచర్స్ మీట్ కార్యక్రమం ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్ పూరిమెట్ల యల్లయ్య మాట్లాడుతూ, తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం మరింత మెరుగుపడుతుందని అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విద్యా వ్యవస్థలో సానుకూల మార్పులకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరావు, ఎంపీటీసీ పాలపర్తి సుబ్బారావు, పాశం వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాలపై తల్లిదండ్రుల ప్రశంసలు



రెంటచింతల జులై 24 వార్త సాక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీట్కు విశేష స్పందన లభించింది. మల్లవరం గ్రామ ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ కొర్ర జాను నాయక్, మాజీ సర్పంచ్ మేకల బాల సైదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, సైన్స్ పరికరాలు, క్రీడా సామగ్రి, విద్యార్థుల అభ్యాస పురోగతిని పరిశీలించారు. హాస్టల్‌లో అందిస్తున్న భోజన నాణ్యత, ఇతర సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.హెడ్మాస్టర్ కే. అమల బాబు ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, విద్యార్థులకు పలు ఆటలు, పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగలక్ష్మి, అహమ్మద్, ఆంజనేయులు, లింగా నాయక్, నరసింహారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతిభకు ప్రోత్సాహం



రెంటచింతలజులై 24 వార్త సాక్ష్యం

ఈ ఏడాది నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన రెంటాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్. మాధవికి బీజేపీ మండల అధ్యక్షుడు ఇగుటూరి రాజశేఖరరెడ్డి నగదు ప్రోత్సాహకంగా రూ. 10 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం వల్ల మరింత మంది ఉన్నత ఫలితాలు సాధించేందుకు స్ఫూర్తి పొందుతారని అన్నారు. ఇదే కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన పి. నవీన, అమూల్య, పి. కల్పనలకు వరుసగా రూ. 7 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు విలువైన చెక్కులను అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను నగదు బహుమతులతో సత్కరించడం వరుసగా రెండో సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెడ్‌మిస్ట్రెస్ భారతి, సత్యనారాయణరెడ్డి, రంగారెడ్డి, బిచ్చిరెడ్డి, లింగారెడ్డి, భట్టాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి ఎస్సై మాధవరావు



చందోలు జులై 24 వార్త సాక్ష్యం

జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు చందోలు ఎస్ఐ కె. మాధవరావు పోలీసు సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించి, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి, అవసరమైన వాహన పత్రాలు లేని వారికి మోటారు వాహన చట్టం ప్రకారం చలానాలు విధించారు.అనంతరం ఎస్ఐ మాధవరావు మాట్లాడుతూ, “శిరో రక్ష--ప్రాణ రక్ష” ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రయాణించే వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



జూలై 24 మంచిర్యాల వార్త సాక్ష్యం

సూక్ష్మ ఆహార తయారీ రంగంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించడం, గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువ పారిశ్రామిక వేత్తలను ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార తయారీ సంస్థల ఫార్మలైజేషన్ పథకం కింద పెండింగ్‌లో ఉన్న బ్యాంకు దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పిఎంఎఫ్ఎంఈ సింగిల్ విండో డ్రైవ్ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి,జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంపొందించడంలో పిఎంఎఫ్ఎంఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులకు విలువను జోడించి,నాణ్యమైన ఆహార ఉత్పత్తులుగా మార్కెట్ లోకి తీసుకురావడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం సిద్ధం చేసిన ప్రతి పిఎంఎఫ్ఎంఈ దరఖాస్తుకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ను సంబంధిత బ్యాంకులకు పూర్తి స్థాయిలో సమర్పించి, ఎటువంటి సాంకేతిక లోపాలు లేకుండా పరిశీలన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకు మేనేజర్లు ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, రుణాలు సకాలంలో మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పథకం క్రింద అర్హులైన ప్రతి లబ్ధిదారునికి రుణాలు అందించి,యూనిట్ల స్థాపన ప్రక్రియను వేగవంతం చేయాలని, బ్యాంకులు,సెర్ప్, పరిశ్రమల శాఖ, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని,లబ్ధిదారులకు ఎదురయ్యే ప్రతి సమస్యను సింగిల్ విండో విధానంలో పరిష్కరించి,పథకం అమలులో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. జిల్లాలో ఆహార ప్రాసెసింగ్ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని,స్థానికంగా లభించే వ్యవసాయ ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం,గ్రామీణ యువతకు ఉపాధి, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి అర్హుడైన లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని తెలిపారు.అనంతరం బ్యాంకుల వారీగా జిల్లా స్థాయిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల వివరాలపై సమీక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి డి.అంజయ్య, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారులు, వివిధ బ్యాంకుల జిల్లా సమన్వయ అధికారులు,శాఖల మేనేజర్లు,సెర్ప్ ఎ పి ఎం లు, సి సి లు, మెప్మా సిబ్బంది, పిఎంఎఫ్ఎంఈ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్ మీట్‌లో విద్యార్థులకు ప్రేరణ సందేశం

-ఎంపీటీసీ తాంద్ర సాంబశివరావు

కర్లపాలెం జులై 24 వార్త సాక్ష్యం



కర్లపాలెం మండలం నల్లమోతువారి పాలెంలోని మూడు ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీటీసీ సభ్యులు తాంద్ర సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన స్కూల్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేసి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయంగా మాట్లాడారు.విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ‘తల్లికి వందనం’, యూనిఫాం, స్కూల్ బ్యాగులు వంటి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. అంబేద్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు సమాజానికి, దేశానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ‘తల్లికి వందనం’ పథకం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మాడా శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి గరిగంటి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రావి రాంబాబు రెడ్డి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విన్యాసాలకు ప్రశంసలు



రెంటచింతల జులై 24 వార్త సాక్ష్యం

రెంటచింతలమండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ మీట్ ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని 37 పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు సభకు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల క్రమశిక్షణ, సమన్వయం, ప్రతిభకు తల్లిదండ్రులు, అతిథులు ప్రశంసలు కురిపించారు.సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో మండల స్పెషల్ ఆఫీసర్ నాగరాజు మాట్లాడుతూ ‘తల్లికి వందనం’ పథకం ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి విద్యావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని ఎంఈవో-2 శివ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ గోవిందు బాలస్వామి, ప్రిన్సిపాల్ ఎస్. మోహన్, విద్యావేత్త శ్రీనివాసరావు, ప్రదీప్ కుమార్ రెడ్డి, రోశిరెడ్డి, హెడ్‌మాస్టర్లు షిలార్, అమలబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలతో పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

-రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా

జూలై 24 బెల్లంపల్లి నియోజకవర్గ వార్త సాక్ష్యం



ప్రజలతో పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించి పోలీసు శాఖకు ఉన్న తేవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ఝా సూచించారు. శుక్రవారం రోజు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఉన్న తాండూర్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,ఏసీపీ కిరణ్ కుమార్,సీఐ దేవయ్య పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా తాండూర్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్ సర్కిల్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల సీడీ ఫైళ్లు, పెండింగ్ ట్రయల్ కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను పరిశీలించారు. ముఖ్యంగా పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తమ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను క్రమం తప్పకుండా సందర్శిస్తూ,వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది విధి నిర్వహణను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. భూ వివాదాలకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా, నిజాయితీతో విచారించి, చట్టబద్ధంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తులపై అనవసరంగా బలప్రయోగం చేయరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మేరకే చట్టబద్ధమైన బలాన్ని వినియోగించాలని సూచించారు. నేరాల నియంత్రణ కోసం రాత్రి వేళల్లో ప్రివెంటివ్ పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు నిర్వహించాలని, సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు.ప్రతి సర్కిల్‌లో సమస్యలు తలెత్తక ముందే వాటిని గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.నేరాల దర్యాప్తులో వస్తున్న తాజా పరిణామాలపై ఎప్పటి కప్పుడు అవగాహన పెంపొందిం చుకోవాలని, ముఖ్యంగా ఎస్ఐ స్థాయి నుంచి పైస్థాయి అధికారులందరూ సీసీటీఎన్ఎస్, సమాచార సాంకేతికత (ఐటీ),ఆధునిక పోలీసింగ్ లో వినియో గిస్తున్న సాంకేతిక వ్యవస్థలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. భవిష్యత్తులో సాంకేతికత వినియోగం మరింత పెరుగుతుందని, ప్రమోషన్లతో బాధ్యతలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి అధికారి తమ సాంకేతిక నైపుణ్యాలను (సాఫ్ట్ స్కిల్స్) అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రతి పిటిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ఫిర్యాదుదారుల వివరాలను సమగ్రంగా ధృవీకరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి పిటిషనర్ తో మర్యాదపూర్వకంగా, ఓర్పుతో వ్యవహరించి,చట్ట పరిధిలో సాధ్యమైనంత సహాయం అందించాలని సూచించారు.విధి నిర్వహణలో ఎలాంటి పక్షపాతం లేకుండా నిష్పాక్షికంగా వ్యవహరించి, చట్టబద్ధంగా ప్రజలకు న్యాయం చేయడమే ప్రతి పోలీసు అధికారి ప్రధాన బాధ్యత అని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.

## బెల్లంపల్లి ఎం.జె.పి. బాలికల పాఠశాల విద్యార్థినులు క్షేమం

-ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త సేరు శ్రీధర్

జూలై 24 బెల్లంపల్లి వార్త సాక్ష్యం



మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లిలో గల మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ జరిగినట్లు ఎలాంటి నిర్ధారణ కాలేదని,కేవలం అజీర్తి కారణంగా వాంతులు, కడుపునొప్పి వంటి స్వల్ప ఆరోగ్య సమస్యలు తలెత్తినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులకు పాఠశాలలోనే ప్రథమ చికిత్స అందించినప్పటికీ, వారి ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్త చర్యగా ఆసుపత్రికి తరలించడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహించిన అన్ని వైద్య పరీక్షల ఫలితాలు సాధారణంగానే వచ్చాయని,ఫుడ్ పాయిజన్‌కు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు గుర్తించలేదని వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉండటంతో ఆసుపత్రి వైద్యులు విద్యార్థినులను 12 నుంచి 14 గంటలలోనే డిశ్చార్జ్ చేసి పాఠశాలకు పంపించారని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినులందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని,అనంతరం వారిని సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేది ఉదయం జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్ పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులందరికీ సమగ్రఆరోగ్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. మంచిర్యాల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసురామ్ పాఠశాలను సందర్శించి కిచెన్, ఆహార నిల్వ గదులు, పారిశుద్ధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి,ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారని తెలిపారు.ఆహార నమూనాల పరీక్షలలో ఏవైనా లోపాలు గుర్తించబడితే సంబంధిత సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన సమగ్ర నివేదికను సంబంధిత జిల్లా అధికారులు, సొసైటీ ఉన్నత అధికారులకు పంపించడం జరిగిందని, తదుపరి ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR


# నాగుల చెరువు శిఖం భూముల కబ్జా వ్యవహారం మరోసారి తెరపైకి లోకాయుక్త లో ఫిర్యాదు చేసిన సమాచార హక్కు సంరక్షణ కమిటీ సభ్యులు ధీరావత్ శ్రీనివాస్

**-డిప్యూటీ కలెక్టర్, ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే, పోలీస్ బృందాల క్షేత్రస్థాయి విచారణ**

**-95.27 ఎకరాలకు 66.35 ఉన్నట్లు ఫిర్యాదులో వెల్లడి**

**-అక్రమించిన శిఖం భూముల ఆక్రమణల విలువ రూ. 45 నుంచి రూ. 50 కోట్లు ఉన్నట్లు సమాచారం**

జులై 24 నల్గొండ వార్త సాక్ష్యం

సిమెంట్ పరిశ్రమలు, దేశంలోనే రెండవ అతిపెద్ద యాదాద్రి థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్ నిర్మాణంతో రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన దామరచర్ల మండల కేంద్రంలో భూముల విలువ కోట్లలో పెరిగింది. కాగా దామరచర్ల మండల కేంద్రంలో అద్దంకి నార్కెట్ పల్లి హైవేకు అనుకుని ఉన్న నాగుల చెరువుకు సంబంధించిన శిఖం భూముల ఆక్రమణలపై లోకాయుక్తకు సమాచార హక్కు సంరక్షణ కమిటీ సభ్యులు ధీరావత్ శ్రీను నాయక్ ఫిర్యాదు నేపథ్యంలో శుక్రవారం లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఇస్మాయిల్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ వెంకటేష్ ప్రసాద్, ఏడీ సర్వేయర్ దేవరాజు, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీశైలం, ఎమ్మార్వో జవహర్ లాల్, ఆర్ఐ సురేందర్ సింగ్, పోలీస్ శాఖ సంయుక్తంగా నాగుల చెరువు ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది.

**-20 రోజుల్లో నాగులచెరువు శిఖం భూముల అక్రమణపై నివేదికకు ఆదేశం**

దామరచర్ల మండల పరిధిలోని నాగుల చెరువు సర్వే నెంబర్ 1152 లో 95.27 ఎకరాలు ఉండగా 66.34 ఎకరాలు మాత్రమే ఉందని అధికారులు చెబుతుండగా లోకాయుక్త కు ఫిర్యాదు చేసిన శ్రీనివాస్ నాయక్ తో పాటు ప్రముఖ అడ్వకేట్ నక్క శ్రీనివాస్... సేత్వార్ రికార్డు ప్రకారం నాగుల చెరువు విస్తీర్ణం 95.27 ఎకరాలు కాగా... సుమారు 30 ఎకరాల 13 గుంటల విలువైన చెరువు భూమి ఆక్రమణలకు గురైనట్లు క్షేత్రస్థాయి విచారణకు వచ్చిన లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఇస్మాయిల్ కు వివరించారు. హైవే రోడ్డుకు ఉన్నటువంటి



నాగుల చెరువు శిఖం భూముల ఆక్రమణల విలువ రూ.40 నుంచి రూ.50 కోట్లకు పైచిలుకు ఉంటుందని లోకాయుక్త బృందానికి వెల్లడించారు. గత ప్రభుత్వంలో మిషన్ కాకతీయ స్కీంలో నాగుల చెరువు విస్తీర్ణం 95.27 ఎకరాలను రికార్డుల్లో చూపిస్తూ... అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ కాకతీయ పేరిట చెరువును పునరుద్ధరించినట్లు... రూ.70 లక్షల నిధులు డ్రా చేసినట్లు... లోకాయుక్త టీంకు ఫిర్యాదుదారుడితో పాటు న్యాయవాది శ్రీనివాస్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో చెరువు విస్తీర్ణాన్ని పరిశీలించిన లోకాయుక్త బృందం... అనంతరం చెరువు నక్షాను పరిశీలించారు. ఆగస్టు 15 నాటికి ఇరిగేషన్ అధికారులు నాగుల చెరువు మొత్తం విస్తీర్ణం, ఆక్రమణకు గురైన భూముల విస్తీర్ణం, కబ్జాదారుల వివరాలతో నివేదిక సిద్ధం చేసి రెవెన్యూ శాఖకు అప్పగించాలని... ఆగస్టు 16 నాటికి లోకాయుక్తకు అప్పగించాలని లోకాయుక్త ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

**-కోట్ల విలువైన శిఖం భూముల చెర వీడేనా**

మిర్యాలగూడ నియోజకవర్గంలో భాగమైన దామరచర్ల అభివృద్ధిలో శరవేగంగా దూసుకెళ్తోంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నియోజకవర్గ కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని కోట్ల విలువైన శిఖం భూముల ఆక్రమణల చెర వీడనుందా అన్నది లోకాయుక్త అధికారుల బృందం ప్రస్తుత చర్యలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాదులో వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను, చెరువు శిఖం భూములను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాతో చెరువు భూములు తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి వస్తుండగా... దామరచర్ల మండల కేంద్రంలోనూ విలువైన చెరువులు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని స్థానికుల నుంచి డిమాండ్ వస్తోంది.

# మొక్కలు నాటుదాం- ప్రభుత్వానికి మనవి చేద్దాం



**-వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల వినూత్న నిరసన**

వార్త సాక్ష్యం జులై 24 నాగార్జునసాగర్ టౌన్:

“రెండు నెలలుగా మా సమస్యలను వినిపించేందుకు అవకాశం లేదు. ఆత్మగౌరవంతో వాటిని పరిష్కరించుకునే ఆస్కారం కూడా లేదు” అంటూ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.దాదాపు 185 వివిధ స్థాయిల ఆసుపత్రులు, 4,000 మంది సిబ్బందితో ప్రభుత్వ వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న వైద్య విధాన పరిషత్ (త్వరలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మారనున్న సంస్థ)లో కమిషనర్ పదవీ విరమణ చేసి రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు రెగ్యులర్ కమిషనర్‌ను నియమించకపోవడంతో ఆసుపత్రుల పనితీరుపై సరైన పర్యవేక్షణ కొరవడిందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్, మినిస్టీరియల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ వ్యక్తిగత, సర్వీస్ పరమైన సమస్యలను పరిష్కరించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.ఈ విషయమై ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో వైద్య విధాన పరిషత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో “మొక్కలు నాటుదాం... మనవి చేద్దాం” పేరుతో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం నాగార్జునసాగర్ లో కమలా నెహ్రూ ఏరియా హాస్పిటల్ ఆవరణలోలో వైద్యులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటుతూ, “పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంత అవసరమో, మా సమస్యల పరిష్కారానికి రెగ్యులర్ కమిషనర్ నియామకం కూడా అంతే అవసరం” అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఇప్పటికైనా తమ ఆవేదనను అర్థం




చేసుకుని వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించి, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్డెంట్ హరికృష్ణ, డాక్టర్లు రవి,కోటియా నాయక్, ఫిజియోథెరపీ డా:సోమశేఖర్, నర్సింగ్ సూపర్డెంట్ పాలిన, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి వాడపల్లి శ్రీధర్, జూనియర్ ఎనలిస్ట్, ఫార్మర్స్ సూపర్వైజర్ శ్రీజ్యోతి, బ్రాంచ్ సెక్రటరీ రాములు,జెయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శ్రీదేవి, ప్రవీణ్ కుమార్, కిషోర్, యూనస్,నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ విస్తరణ,అభివృద్ధిలో ప్రతి పనికి గడువు విధించి.. నిర్మాణాలు చేపట్టాలి

**-అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి**

**-వీటీఏడీఏ పనులపై అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సమీక్ష**

జులై 24 రాజన్న సిరిసిల్ల జిల్లా వార్త సాక్ష్యం

వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీ టీఏడీఏ) ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీ టీఏడీఏ) పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం దేవాదాయ శాఖ,మున్సిపల్, ఆర్ అండ్ బీ,ఎన్పీడీసీఎల్, పశు సంవర్ధక శాఖ,రెవెన్యూ,నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ,అభివృద్ధి పనులకు ప్రతి పనికి గడువు నిర్ణయించి.పూర్తి చేయాలని ఆదేశించారు.అధికారులు సమన్వయం తో పని చేయాలని సూచించారు.రాజ రాజేశ్వర ఆలయానికి చెందిన నూతన గోశాల స్థలం కేటాయింపు,మిగతా పనుల పురోగతిని రెవెన్యూ,పశు సంవర్ధక శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడిచెరువు అభివృద్ధి,సుందరీకరణ



పనుల్లో తుది దశ పనులను త్వరితగతిన చేయాలని సూచించారు.టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ తదితర అంశాలపై మున్సిపల్,పర్యాటక శాఖ అధికారులకు సూచనలు చేశారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచిం చారు. ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు చేపడుతున్న 80 ఫీట్ల రహదారి విస్తరణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.రహదారి నిర్మాణం, ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణం,ఇతర పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ,కాంట్రాక్టర్ ను ఆదేశించారు. సందర్శనలో ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి,ఆర్ అండ్ బీ ఈఈ నరసింహ చారి,పర్యాటక శాఖ ఎస్ ఈ సరిత,పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి,ఆలయ ఈఈ రాజేష్,నీటి పారుదల ఈఈ దయాకర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్,ఎ న్పీడీసీఎల్ అధికారులు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

**-రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిలో ప్రతి పనికి గడువు విధించి.. నిర్మాణాలు చేపట్టాలి**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**-వీటీఏడీఏ పనులపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష**

సిరిసిల్ల జిల్లా జూలై 24,వార్త సాక్ష్యం



వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీ టీఏడీఏ) ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీ టీఏడీఏ) పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం దేవాదాయ శాఖ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, ఎన్పీడీసీఎల్, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులకు ప్రతి పనికి గడువు నిర్ణయించి.. పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాజ రాజేశ్వర ఆలయానికి చెందిన నూతన గోశాల స్థలం కేటాయింపు, మిగతా పనుల పురోగతిని రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడిచెరువు అభివృద్ధి, సుందరీకరణ పనుల్లో తుది దశ పనులను త్వరితగతిన చేయాలని సూచించారు. టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ తదితర అంశాలపై మున్సిపల్, పర్యాటక శాఖ అధికారులకు సూచనలు చేశారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు.ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు చేపడుతున్న 80 ఫీట్ల రహదారి విస్తరణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. రహదారి నిర్మాణం, ఇరువైపులా మురుగు కాలువ నిర్మాణం, ఇతర పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ను ఆదేశించారు.సందర్శనలో ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహ చారి, పర్యాటక శాఖ ఎస్ ఈ సరిత, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఆలయ ఈఈ రాజేష్, నీటి పారుదల ఈఈ దయాకర్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఎన్పీడీసీఎల్ అధికారులు తదితరులు ఉన్నారు.

## జంగంపల్లి, అంతంపల్లిలో వైద్య శిబిరాలు



జూలై 24, బిక్కనూర్ వార్త సాక్ష్యం

బిక్కనూర్ మండల పరిధిలోని అంతంపల్లి, జంగంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలు, విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. అంతంపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సంగీత గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియా నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జంగంపల్లి మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ బాలికల వసతిగృహంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 35 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి, 28 మందికి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే హాస్టల్‌లో 43 మంది బాలికలకు హెచ్‌పీవీ (హ్యూం) టీకాలు వేశారు. టీకా కార్యక్రమానికి ముందు వైద్య బృందం హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యత, గర్భాశయ క్యాన్సర్ నివారణలో దాని పాత్రపై విద్యార్థినులకు అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమాల్లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ మహాలక్ష్మి, ఆరోగ్య విస్తరణ అధికారి మొహమ్మద్ మంజూర్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సంగీత, ఏఎన్ఎంలు వినోద, జ్యోతి, రజిత, శ్రీలత, హాస్టల్ ప్రిన్సిపాల్ రాధిక, సూపర్వైజర్ రోహిణి, ఆశా కార్యకర్తలు, గ్రామ సర్పంచ్, హాస్టల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శనివారం 25 జూలై, 2026

# బిజినెస్

## తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. నెరవేరనున్న ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న చిరకాల వాంఛను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ప్రణాళిక ప్రకారం అన్నీ జరిగితే, తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన డిసెంబరు 9వ తేదీన విలీనంపై తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈలోగా విలీన ప్రక్రియకు సంబంధించిన పూర్తి విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. విలీన ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది. ఆగస్టు మూడో వారంలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సంఘాన్ని విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ హామీతో కార్మిక సంఘాలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, డిపోల వారీగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు వంటి 32 డిమాండ్లను యాజమాన్యం ముందుంచారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు చాలా డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చింది. ఇప్పుడు అత్యంత కీలకమైన విలీనం, ఎన్నికల ప్రక్రియలపై దృష్టి సారించింది. ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం, మొదట ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, గెలిచిన సంఘం అభిప్రాయాలను తీసుకుంటారు. ఆ తర్వాత విలీనానికి సంబంధించిన ఆర్థిక, పరిపాలన, న్యాయపరమైన అంశాలపై తుది విధివిధానాలను ఖరారు చేస్తారు. డిసెంబరు 9న విలీనంపై అధికారిక ప్రకటన చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ యాజమాన్యానికి ప్రభుత్వం నుంచి ఇప్పటికే సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ ఉద్యోగుల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు స్పష్టమవుతోంది.

## ఎయిర్‌లైన్స్ వ్యాపారంలో అదానీ, జీఎంఆర్‌కు ఎంట్రీ!




న్యూఢిల్లీ:
అదానీ, జీఎంఆర్ వంటి విమానాశ్రయాల నిర్వాహణ సంస్థలను కూడా ఎయిర్‌లైన్స్ వ్యాపారంలోకి అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన విధానాలను సడలించే దిశగా పౌర విమానయాన శాఖ ఇప్పటికే అంతర్గత చర్చలను ప్రారంభించినట్లు తెలిసింది. అయితే, ఈ విధానపరమైన మార్పునకు కేంద్ర న్యాయ శాఖతో పాటు ప్రధాని నేతృత్వంలోని కేబినెట్ కమిటీ కూడా ఆమోదం తెలపాల్సి ఉంటుంది. నిబంధనల మార్పు ద్వారా దేశీయ విమానయాన సేవల విభాగంలో 90 శాతం మార్కెట్ వాటా కలిగిన ఇండిగో, ఎయిరిండియాల ఆధిపత్యానికి అడ్డుకట్ట పడనుంది. అలాగే, కొత్త ఎయిర్‌లైన్స్ ప్రవేశంతో మార్కెట్లో పోటీ పెరుగుతు ఒదని కేంద్రం భావిస్తోందని ఈ విషయంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం విమానాశ్రయాల నిర్వహణ సంస్థలు ఏదేని ఎయిర్‌లైన్స్‌లో 10 శాతానికి మించి వాటా కలిగి ఉండటానికి అనుమతి లేదు. ఈ పరిమితిని ఎత్తివేస్తే, విమానాశ్రయ నిర్వహణ సంస్థలు కూడా ఎయిర్‌లైన్స్‌లో యాజమాన్య వాటా కలిగి ఉండటంతో పాటు వాటిని నిర్వహించేందుకు వీలు కలగనుంది. ప్రస్తుతం అదానీ గ్రూప్ ముంబైలో రెండు ఎయిర్‌పోర్ట్‌లతో పాటు మరో 6 విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. దేశీయంగా జీఎంఆర్ గ్రూప్ చేతిలో హైదరాబాద్, ఢిల్లీ, గోవా ఎయిర్‌పోర్ట్‌లున్నాయి. భోగాపురం విమానాశ్రయం వచ్చే నెలలో ప్రారంభం కానుంది. అదానీ ఆసక్తి: ఒకవేళ కేంద్ర ప్రభుత్వం నిబంధనలను సడలిస్తే కొత్త ఎయిర్‌లైన్స్‌ను ప్రారంభించేందుకు భారత కుబేరుడు గౌతమ్ అదానీ ఆసక్తిగా ఉన్నట్లు రాయిటర్స్ తాజా కథనం వెల్లడించింది. అయితే, అంతగా లాభాలు పంచే వ్యాపారం కాకపోవడంతో పాటు రిస్క్ ఎక్కువ కావడంతో అన్ని లెక్కలూ సరిచూసుకున్న తర్వాతే అదానీ బరిలోకి దిగే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అదే గనుక జరిగితే, ఎయిర్‌లైన్స్ మార్కెట్లో ఇండిగో, ఎయిరిండియాకు అదానీ గట్టి పోటీనిచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

## ఫ్లిప్‌కార్ట్‌కు భారీ షాక్- ఐఫోన్‌కు బదులు ఆయిల్ పంపినందుకు రూ.1.81 లక్షల జరిమానా




ఆన్‌లైన్ షాపింగ్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌కు, దాని ప్లాట్‌ఫామ్‌లోని ఓ విక్రేతకు ముంబై వినియోగదారుల ఫోరం గట్టి షాకిచ్చింది. ఖరీదైన యాపిల్ ఐఫోన్ ఆర్డర్ చేసిన వినియోగదారుడికి 'బియర్డ్ గ్రోత్ ఆయిల్' (గడ్డం పెరిగే నూనె) పంపిన కేసులో బాధితుడికి రూ. 1.11 లక్షల అసలు మొత్తంతో పాటు రూ. 70,000 నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఫిర్యాదులను సరైన పరిష్కారం చూపకుండా పదేపదే మూసివేయడం 'అనుచిత వాణిజ్య విధానం' కిందకే వస్తుందని కమిషన్ తన తీర్పులో పేర్కొంది.

**-అసలేం జరిగిందంటే..!**

ముంబైలోని పోవాయ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి 2023 ఏప్రిల్ 22న ఫ్లిప్‌కార్ట్ ద్వారా రూ. 1,11,793 వెచ్చించి యాపిల్ ఐఫోన్ 14 ప్రో (128 +B)ను నో-కాస్ట్ ఈఎంఐ స్కీమ్‌లో ఆర్డర్ చేశారు. మరుసటి రోజు డెలివరీ అయిన ప్యాకేజీని తెరిచి చూడగా, అందులో స్మార్ట్‌ఫోన్‌కు బదులుగా బియర్డ్ గ్రోత్ ఆయిల్ బాటిల్, ప్యాకింగ్ సామగ్రి ఉండటంతో ఆయన షాక్ అయ్యారు. వెంటనే ఫ్లిప్‌కార్ట్ కస్టమర్ సపోర్ట్‌ను సంప్రదించి, అవసరమైన అన్ని ఆధారాలు సమర్పించారు. అయితే, 2023 ఏప్రిల్ నుంచి మే మధ్య పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫ్లిప్‌కార్ట్ నుంచి ఎలాంటి సరైన స్పందన రాలేదు. సమస్యను పరిష్కరించకుండానే, ఆయన ఫిర్యాదును 'పరిష్కరించబడింది' అని పదేపదే మూసివేశారు. దీంతో విసిగిపోయిన బాధితుడు ముంబై సబర్బన్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ఫోరం, ఫ్లిప్‌కార్ట్, విక్రేత ఇంటర్నేషనల్ వ్యాల్యూ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ తీరును తప్పుబట్టింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో వినియోగదారుడు డబ్బు చెల్లించినప్పుడు, ఆర్డర్ చేసిన వస్తువును సరిగ్గా అందించాల్సిన బాధ్యత ఈ-కామర్స్ సంస్థపై ఉంటుందని స్పష్టం చేసింది. తప్పు జరిగాక కేవలం అమ్మకానికి మధ్యవర్తిత్వం వహించామని చెప్పి చేతులు దులుపుకోలేదని, ఫిర్యాదును విచారించడంలో, తప్పుగా పంపిన వస్తువును వెనక్కి తీసుకోవడంలో, రీఫండ్ లేదా రీప్లేస్‌మెంట్ ఇవ్వడంలో విఫలమవడం స్పష్టమైన సేవా లోపమని పేర్కొంది.

# అందుకే ఆర్ఆర్‌తో నా ప్రయాణాన్ని ముగించాను: సంజు శాంసన్

# క్రీడలు




ఇంటర్నెట్ డెస్క్:
భారత స్టార్ ప్లేయర్ సంజు శాంసన్ ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ జట్టును వీడి చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ఈ విషయంపై సంజు స్పందించాడు. 11 సీజన్ల పాటు రాజస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించిన అతడు..ఆ జట్టును వీడాలనే నిర్ణయం అంత సులభంగా అవ్వలేదని పేర్కొన్నాడు. అయితే కొత్త సవాళ్లను స్వీకరించాలనే ఆలోచనతోనే ఆ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన సంజు.. పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు .రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం చాలా పెద్ద రిస్క్. ఒకసారి ఫ్రాంచైజీకి మీ నిర్ణయం చెప్పాక వెనక్కి తగ్గే అవకాశం ఉండదు. 2025 సీజన్‌తో ఆర్ఆర్‌తో నా ప్రయాణం ముగించాలనే నిర్ణయానికి వచ్చాను. ఈ విషయంపై నా కుటుంబంతో, ముఖ్యంగా నా భార్యతో మూడు వారాల పాటు చర్చించాను. చివరకు ఇదే సరైన నిర్ణయమని భావించా. నేను ఎప్పుడూ కొత్తగా మొదలుపెట్టడానికి సిద్ధంగానే ఉంటాను. చెపాక్ నెమ్మదైన పిచ్.. నా బ్యాటింగ్‌కు సరిపోదని చాలామంది అన్నారు. ఆ ఆలోచన నా మనసులోకి కూడా వచ్చింది. కానీ 'నీకు ఇప్పుడు 30 ఏళ్లు. కొత్త పరిస్థితులకు తగ్గట్టు నీ ఆటను మార్చుకో' అని నాకు నేనే చెప్పుకున్నాను. అదే ఆత్మవిశ్వాసంతో ఈ సీజన్‌ను ప్రారంభించాను' అని సంజు పేర్కొన్నాడు.

**-వైఫల్యాలే ఎక్కువ..**

'టీ20 క్రికెట్‌లో విజయాల కంటే వైఫల్యాలే ఎక్కువ ఉంటాయి. సీఎస్కేలో తొలి మూడు మ్యాచ్‌ల్లో నేను విఫలమయ్యాను. ప్రపంచకప్ ఫైనల్ ఆడి వచ్చినా ఆ ఫామ్‌ను ఐపీఎల్‌లో కొనసాగించలేకపోయాను. అయినా జట్టు యాజమాన్యం, సహచరుల వైఖరిలో ఒక్క శాతం కూడా మార్పు రాలేదు. అదే నాకు ఎంతో ధైర్యం ఇచ్చింది. ప్రాక్టీస్ సమయంలో మాహీ భయ్యా నా దగ్గరకు వచ్చి 'అన్నీ బాగానే ఉంటాయి. నువ్వు నీలాగే ఆడు' అని చెప్పారు. ఆ చిన్న మాటే నాకు పెద్ద పాఠంగా మారింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై సెంచరీతో మళ్లీ నా జోరు మొదలైంది' అని సంజు తెలిపాడు.

## కామన్వెల్త్ గేమ్స్: సెమీస్‌కు భారత స్విమ్మర్ శ్రీహరి నటరాజ్




ఇంటర్నెట్ డెస్క్:
గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ సత్తా చాటాడు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో సెమీఫైనల్‌లో అడుగుపెట్టాడు. శుక్రవారం జరిగిన హీట్స్‌లో శ్రీహరి 25.52 సెకన్లలో రేసును పూర్తి చేసి సంయుక్తంగా 14వ స్థానంలో నిలిచాడు. బెర్ముడాకు చెందిన జాక్ హార్వేతో సమాన సమయాన్ని నమోదు చేసిన నటరాజ్.. టాప్-16లో చోటు దక్కించుకుని సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు. ఎనిమిది మంది పాల్గొన్న ఈ హీట్‌లో శ్రీహరి ఐదో స్థానంలో నిలిచాడు. రెండు ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఈ భారత స్విమ్మర్.. ఇప్పటికే పలు జాతీయ రికార్డులు తన పేరిట నమోదు చేసుకున్న సంగతి తెలిసిందే.పారా స్విమ్మింగ్‌లో ఫైనల్‌కు. పారా స్విమ్మింగ్ 100 మీటర్ల ఫ్రీస్టైల్ ఎస్13 విభాగంలో భారత క్రీడాకారులు ఆర్‌వీవీబీకే బుడిగినా, ఇమామ్ అలీ ఫైనల్‌కు అర్హత సాధించారు. ఈ విభాగంలో హీట్స్‌లో పాల్గొన్న ఎనిమిది మంది ఆటగాళ్లూ ఫైనల్‌కు చేరడం విశేషం. బుడిగినా 57.10 సెకన్ల టైమింగ్‌తో హీట్స్‌లో మూడో స్థానంలో నిలవగా.. ఇమామ్ అలీ 1:05.32 సెకన్లతో చివరి స్థానంలో ఉన్నాడు. కాగా, ఎస్13 విభాగం దృష్టి లోపం ఉన్న అథ్లెట్ల కోసం నిర్వహించే పారా స్విమ్మింగ్ కేటగిరీ.

## ఆసియా క్రీడలు: క్రికెట్ షెడ్యూల్ విడుదల నేరుగా క్వార్టర్ ఫైనల్‌లోకి టీమిండియా




ఇంటర్నెట్ డెస్క్:
జపాన్ వేదికగా జరగనున్న ఆసియా క్రీడలు 2026లో క్రికెట్ పోటీల షెడ్యూల్‌ను నిర్వాహకులు విడుదల చేశారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరిగే ఈ మెగా ఈవెంట్‌లో క్రికెట్ నాలుగోసారి చోటు దక్కించుకున్న సంగతి తెలిసిందే. మహిళల టీ20 మ్యాచ్‌లు సెప్టెంబర్ 17న ప్రారంభం కానుండగా.. పురుషుల టోర్నీ సెప్టెంబర్ 24 నుంచి మొదలు కానుంది. అన్ని మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్‌లో జరగడంతో పాటు పూర్తి అంతర్జాతీయ హోదా కలిగి ఉండనున్నాయి. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగనున్నాయి.పురుషుల విభాగంలో టాప్ సీడ్ జట్లు భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఇక గ్రూప్-ఎలో అఫ్గానిస్థాన్, జపాన్, నేపాల్.. గ్రూప్-బిలో హాంకాంగ్ చైనా, మలేషియా, ఒమన్ జట్లు మిగిలిన నాలుగు క్వార్టర్ ఫైనల్ స్థానాల కోసం పోటీపడనున్నాయి. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు జట్లు సూపర్ 8 దశకు చేరుకుంటాయి. కాగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఈ టోర్నీలో లీగ్ లేదా క్వార్టర్ ఫైనల్‌లో జరిగే అవకాశం లేదు. ఇరు జట్లు సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో తలపడే అవకాశం ఉంటుంది. దీంతో ఆసియా క్రీడల్లో భారత్-పాక్ పోరు జరగాలంటే రెండు జట్లు చివరి దశ వరకు చేరాల్సిందే.

# గోవిందా, కరిష్మా.. తెర వెనుక ఆసక్తికర బంధం ఇదే!



బాలీవుడ్ తెరపై 90వ దశకంలో అత్యంత విజయవంతమైన జంటల్లో గోవిందా, కరిష్మా కపూర్ జోడీ ఒకటి. వీరిద్దరూ కలిసి అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. అయితే, తెర వెనుక వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం గురించి, షూటింగ్ నాటి జ్ఞాపకాల గురించి గోవిందా తాజాగా కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పని కంటే ఎక్కువగా కరిష్మాకు రక్షణగా ఉండటానికే తాను ప్రాధాన్యత ఇచ్చేవాడినని ఆయన వెల్లడించారు. ఓ ప్రముఖ టాక్ షోలో పాల్గొన్న గోవిందా, కరిష్మాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆమె క్రమశిక్షణ, అంకితభావాన్ని ఆయన ప్రశంసిం చారు. "లోలో (కరిష్మా ముద్దు పేరు) చాలా సింపుల్, అమాయకురాలు. 1940ల నాటి హీరోయిన్ల లాగా నేరుగా షూటింగ్‌కు వచ్చేది. షూటింగ్ సమయంలో పని చేయడం కంటే ఎక్కువగా, నేను లోలోను కాపాడుతూనే ఉన్నాను. ఎప్పుడూ ఆమెకు రక్షణగా నిలిచాను" అని గోవిందా అన్నారు. తాను కలిసి పనిచేసిన నటీమణులలో కరిష్మా అత్యంత నిజాయతీపరురాలని ఆయన కొనియాడారు. గోవిందా మాటలను కరిష్మా కూడా ధ్రువీకరించారు. "ఆయన ఎప్పుడూ నన్ను చాలా జాగ్రత్తగా చూసుకునేవారు" అని ఆమె తెలిపారు. అంతేకాదు తాను స్కూల్‌లో ఉన్నప్పటి నుంచే గోవిందాకు వీరాభిమానినని ఆమె గుర్తుచేసు కున్నారు. ఒక పాత సంఘటనను గుర్తుచేస్తూ.. "నాకు 12-13 ఏళ్లు ఉన్నప్పుడు 'గోవిందా నైట్' అనే షో గురించి పేపర్‌లో చదివాను. ఆ షోకి ఎలాగైనా వెళ్లాలని, టికెట్లు తీసుకురావాలని మా అమ్మానాన్నలతో గొడవపడ్డాను. ఆ షోకి వెళ్లడం నా జీవితంలో గొప్ప క్షణం. షో తర్వాత బ్యాక్‌స్టేజ్‌కి వెళ్లి ఆయన్ను కలిసి ఆటోగ్రాఫ్ కూడా తీసుకున్నాను" అని కరిష్మా ఆనందంగా చెప్పారు. ఇదే సమయంలో 'రాజా బాబు' సినిమా షూటింగ్ నాటి ఓ సంఘటనను గోవిందా గుర్తుచేసుకున్నారు. ఒక సన్నివేశంలో భాగంగా కరిష్మా వాటర్ ట్యాంక్ పైకి ఎక్కాల్సి వచ్చిందని, ఎత్తు చూసి ఆమె చాలా భయపడిపోయిందని తెలిపారు. ఆ భయంతో ఆమె డైలాగులను కూడా వేర్వేరు స్వరాల్లో చెప్పిందని ఆయన నవ్వుతూ చెప్పారు. కాగా, వీరిద్దరూ కలిసి 'రాజా బాబు', 'కూలీ నెం. 1', 'హీరో నెం. 1', 'హసీనా మాన్ జాయేగీ', 'సాజన్ చలే ససురాల్' వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి ఆ తరం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు.



## రామాయణంలో సీతగా సాయి పల్లవి బుల్లితెర సీత దీపిక చిఖాలియా స్పందన



నితేశ్ తివారీ రామాయణం చిత్రంలో టాలీవుడ్ నటి సాయి పల్లవి సీత పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామానంద్ సాగర్ బుల్లితెర రామాయణంలో సీత పాత్రలో అమరిన దీపిక చిఖాలియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రణబీర్ కపూర్, సాయి పల్లవి ఇద్దరూ చాలా మంచి నటులు. సాయి పల్లవి పని చూశాను. ఆమె అద్భుతమైన నటి. రణబీర్ కూడా అద్భుత నటుడు. ఇద్దరూ తమ పాత్రలను అందంగా చూపిస్తారని నాకు నమ్మకం ఉంది" అని దీపిక చిఖలియా అన్నారు. దీపిక చిఖాలియా 1987లో రామానంద్ సాగర్ టీవీ 'రామాయణం'లో సీత పాత్రలో నటించి భారతీ యుల హృదయాల్లో చెరగ ని స్థానం సంపా దించారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ రామా యణం పార్ట్-1 దీపావళి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రం భారీ బడ్జెట్ ప్రాజెక్టుగా రూపొందు తోంది. దీపిక చిఖలియా వ్యాఖ్యలు సాయి పల్లవి అభిమానుల్లో ఉత్సాహం నింపాయి.

## యూ/ఏ సర్టిఫికెట్‌తో విడుదలకు సిద్ధమైన 'శ్రీనివాస మంగాపురం'




సూపర్‌స్టార్ మహేశ్‌బాబు సోదరుడు రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా నటించిన 'శ్రీనివాస మంగాపురం' సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రం జులై 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ కథానాయికగా నటిస్తూ తెలుగు చిత్రసీమకు పరిచయమవుతోంది. తిరుపతి నేపథ్యంగా సాగే ఈ ప్రేమకథలో వాసుబాబు, మంగా అనే ఇద్దరు స్నేహితులు ప్రేమికులుగా మారిన తర్వాత వారి జీవితంలో ఎదురయ్యే అనూహ్య పరిణామాల చుట్టూ కథ సాగుతుంది. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' చిత్రాలతో గుర్తింపు పొందిన అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కించడం సినిమాపై అంచనాలను పెంచింది. అలాగే సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు వారసత్వాన్ని కొనసాగిస్తూ జయకృష్ణ ఘట్టమనేని హీరోగా వెండితెరకు పరిచయం కానుండడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ చిత్రంలో మోహన్‌బాబు ప్రతినాయకుడి పాత్రలో నటించారు. అశ్వినీదత్ సమర్పణలో చంద్రమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.

# సోనీ పిక్చర్స్‌తో భారీ డీల్ 'రామాయణ' ట్రైలర్ విడుదల వాయిదా

నితీశ్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న 'రామాయణం' చిత్రం ట్రైలర్ విడుదల వాయిదా పడింది. అంతర్జాతీయ పంపిణీ హక్కుల నిమిత్తం ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఒప్పందం కుదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈ పరిణామంతో శు క్రవారం ఉదయం విడుదల కావాల్సిన ట్రైలర్ నిలి చిపోయింది. భారతీయ ఇతిహాసం రామాయణా న్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల వద్దకు చేర్చాలన్న తన కల ఈ భాగస్వామ్యంతో సాకార మవుతోందని నమిత్ మల్హోత్రా సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఇదొక విశేషమైన సందర్భమని, అందుకే ట్రైలర్‌ను త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో విడుదల







చేస్తామని ఆయన వివరించారు. అయితే, కొత్త విడుదల తేదీని చిత్ర బృందం ఇంకా ఖరారు చేయలేదు. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తుండగా, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో పోషిస్తున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ, యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు రూ. 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం మొదటి భాగం 2026 దీపావళి కానుకగా విడుదల కానుండగా, రెండో భాగం 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజా ఒప్పందం ప్రకారం, సోనీ పిక్చర్స్ అంతర్జాతీయ స్థాయిలో పంపిణీ బాధ్యతలు చేపట్టగా, దేశీయ మార్కెట్‌లో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.